
**అధ్యక్షులు**
**థామస్ ఎస్. మాన్సన్ చేత**



# ఆయన ఇక్కడ లేడు, లేచియున్నాడు

ఈ రోజు రక్షకుని యొక్క గలిలయ పరిచర్యకు కేంద్రమై సరస్సు ఒడ్డున ఉండిన కపెర్నహోము పట్టణమునకు సంబంధించి కేవలము శిధిలములు మాత్రమే మిగిలియున్నవి. ఇక్కడ ఆయన సమాజమందిరములో ప్రకటించారు, సముద్రపు ఒడ్డున బోధించారు, మరియు గృహములలో స్వస్థపరిచారు.

ఆయన పరిచర్య యొక్క ఆరంభములో, యెషయా నుండి ఒక వాక్యమును యేసు తీసుకొనెను: "ప్రభువగు యెహోవా ఆత్మ నా మీదికి వచ్చియున్నది. దీనులకు సువర్తమానము ప్రకటించుటకు యెహోవా నన్ను అభిషేకించెను. నలిగిన హృదయము గలవారిని ధృఢపరచుటకును, చెరలోనున్నవారికి విడుదలను, బంధింపబడినవారికి విముక్తిని ప్రకటించుటకును ఆయన నన్ను పంపియున్నాడు" (యెషయా 61:1; లూకా 4:18 కూడా చూడుము)- ఇది దేవుని యొక్క కుమారులను మరియు కుమార్తెలను రక్షించుటకు దైవిక ప్రణాళిక యొక్క స్పష్టమైన ప్రకటన.

కానీ గలిలయలో యేసు యొక్క పరిచర్య కేవలము ఆరంభముగా మాత్రమే ఉండెను. గొల్గోతా అని పిలువబడిన ఒక కొండపై గల భయానక సమావేశమును మనుష్యకుమారుడు ఎల్లప్పుడూ కలిగియుండెను.

చివరి భోజనము తరువాత గెత్సేమనే తోటలో చెరపట్టబడిన తరువాత, ఆయన యొక్క శిష్యులచే ఒంటరిగా వదలివేయబడి, ఉమ్మివేయబడి, శిక్షింపబడి, మరియు అవమానింపబడి యేసు తన భారీ సిలువ క్రింద కల్వరి దిశగా నడిపించబడెను. ఆయన విజయము నుండి అప్పగింతకు, హింసింపబడుటకు, మరియు సిలువపై మరణమునకు పురోగమించెను.

"The Holy City" పాట యొక్క పదముల ప్రకారము:

*ఆ అంకము మారెను. . . .*
*ఆ ఉదయము చల్లగా మరియు శీతలముగానుండెను,*
*సిలువ యొక్క నీడ పైకి లేవగా*
*ఒక ఒంటరి కొండపైన.*[1]

మన కొరకు మన పరలోక తండ్రి తన కుమారునిచ్చెను. మన కొరకు మన పెద్ద అన్న తన ప్రాణమునిచ్చెను.

చివరి క్షణంలో బోధకుడు వెనుదిరిగియుండవచ్చును. కానీ ఆయనలా చేయలేదు. మనుష్యజాతినీ, భూమినీ, మరియు దానిలో నివాసమేర్పరచుకొనిన సమస్త జీవులను రక్షించగలిగేందుకు ఆయన అన్నింటినీ జయించెను.

తమ ప్రభువు యొక్క శరీరమును సంరక్షించుటకు ఆ సమాధి వద్దకు వారు వచ్చినప్పుడు దుఖి:ంచుచున్న మగ్దలేని మరియ మరియు మరియొక మరియలతో: "సజీవుడైనవానిని మీరెందుకు మృతులలో వెదకుచున్నారు? ఆయన ఇక్కడ లేడు, ఆయన లేచియున్నాడు" (లూకా 24:5-6) అని దేవదూత పలికిన మాటలకంటే నాకు క్రైస్తవలోకమంతటిలో ఏ ఇతర మాటలూ ఎక్కువ అర్థవంతమయినవి కావు.

ఈ ప్రకటనతో, ఒకప్పుడు జీవించి మరణించినవారు, ఇప్పుడు జీవించుచూ ఒకనాటికి మరణించబోవుచున్నవారు, మరియు జన్మించబోవుచున్న మరియు మరణించబోవుచున్నవారూ అప్పుడే రక్షించబడిరి.

సమాధిపై క్రీస్తు యొక్క విజయము ఫలితముగా, మనమందరమూ పునరుత్థానము చెందుతాము. ఇదే ఆత్మ యొక్క విమోచన. పౌలు వ్రాసెను:

"మరియు ఆకాశ వస్తురూపములు కలవు, భూ వస్తురూపములు కలవు, ఆకాశ వస్తురూపముల మహిమ వేరు, భూ వస్తురూపముల మహిమ వేరు.

"సూర్యుని మహిమ వేరు, చంద్రుని మహిమ వేరు, నక్షత్రముల మహిమ వేరు, మహిమను బట్టి ఒక నక్షత్రమునకును మరియొక నక్షత్రమునకును భేధము కలదు గదా.

"మృతుల పునరుత్థానమును అలాగే" (1 కొరింథీయులు 15:40–42).

మనము కోరుకొనుచున్నది సిలెస్టియల్ మహిమ. మనము నివసించగోరుచున్నది దేవుని యొక్క సమక్షములో. మనము సభ్యత్వము కోరుచున్నది ఒక నిత్యమైన కుటుంబములో.

అంతములేని మరణము నుండి మనలను విడుదల చేసిన ఆయనను గూర్చి, ఆయన సత్యము యొక్క బోధకుడని నేను సాక్ష్యమిచ్చుచున్నాను –కానీ ఆయన బోధకునికంటే గొప్పవాడు. ఆయన పరిపూర్ణ జీవితమునకు గొప్ప మార్గదర్శి—కాని ఆయన మార్గదర్శి కంటే గొప్పవాడు. ఆయన గొప్ప వైద్యుడు—కానీ ఆయన వైద్యునికంటే గొప్పవాడు. ఆయన సాక్షాత్తూ లోకము యొక్క రక్షకుడు. దేవుని యొక్క కుమారుడు, సమాధానాధిపతి. ఇశ్రాయేలీయుల యొక్క పరిశుద్ధుడు, పునరుత్థానుడైన ప్రభువు ఇలా ప్రకటించెను, "నేనే మొదటివాడను, కడపటివాడను, నేనే జీవించుచున్నవాడను, నేనే చంపబడినవాడను; నేను తండ్రితో మీకు ఉత్తరవాదినైయున్నాను" (సి& ని 110:4).

"ఆహా, ఈ మాట నాకెంత ఆనందమిచ్చును: 'నా విమోచకుడు సజీవుడైయున్నాడని నేనెరుగుదును!'"[2]

దీనిని గూర్చి నేను మీకు సాక్ష్యమిచ్చుచున్నాను.

**వివరణలు**

1. Frederick E. Weatherly, "The Holy City" (1892).
2. "నా విమోచకుడు సజీవుడైయున్నాడని నేనెరుగుదును," కీర్తనలు, సంఖ్య. 36.

**ఈ సందేశము నుండి బోధించుట**

మంచి బోధకులు వారు బోధించుచున్నవారి మధ్య ఐక్యతను ప్రోత్సహిస్తారు. జనులు వారి ఆలోచనలను పంచుట మరియు గౌరవపూర్వకముగా ఒకరు చెప్పునది ఇంకొకరు వినుటద్వారా ఒక మంచి వాతావరణమును అనుభూతిచెందుటయే కాక మరింతగా ఏకమౌతారు (*Teaching, No Greater Call* [1999], 63 చూడుము). మీరు మరియు వారు వినమ్రముగా యేసుక్రీస్తు యొక్క ప్రాయశ్చిత్తః త్యాగము మరియు ఆయన పునరుత్థానమును గూర్చి సాక్ష్యములను పంచిన యెడల మీరు బోధించువారి మధ్య ఐక్యత వృద్ధిచెందును. ఈ ఐక్యత అధ్యక్షుడు మాన్సన్ సూచించిన "నిత్యమైన కుటుంబముగా" అగుటకు కుటుంబములకు సహాయము చేయును.

## యువత

# తిరిగి ఇంటికి చేరుకొనుటకు ఆయన మనకు మార్గమును చూపియున్నారు

"దాని ప్రకారము జీవించినట్లైతే, మనల్ని సంతోషపరచు ఒక ప్రణాళిక—పరలోకములో చేయబడిన ఆ ప్రణాళికను ఎలా జీవించాలో మనకు చూపించుటకు రక్షకుడు భూమి మీదకు వచ్చియున్నారు. ఆయన మాదిరి మన పరలోక తండ్రి యొక్క గృహమునకు తిరిగి వెళ్ళుటకు మార్గమును మనకు చూపెను. జీవించియుండిన వారిలో ఎవ్వరూ కూడా అంత 'నిలకడగానూ మరియు స్థిరముగానూ' ఉండియుండలేదు (మోషైయ 5:15). ఆయన ఎప్పుడూ దృష్టి మరలింపబడలేదు. ఆయన పరలోక తండ్రి చిత్తమును నెరవేర్చుటకు దృష్టిసారించెను, మరియు ఆయన తన దైవిక పరిచర్యకు కట్టుబడియుండెను. . . .

"మర్త్యత్వమునకు ముందు లోకములో సమర్పించబడిన ఆ అద్భుత ప్రణాళికలో మీరూ ఒక భాగము. ఆ ప్రణాళిక ఆంగీకరించబడినప్పటి నుండి భూమిపైకి మీ రాకడ ఎదురుచూడబడినది. కాలమునందు మరియు ప్రదేశమునందును మీ స్థానము ఆకస్మికంగా జరిగినది కాదు. అప్పటి 'మీ అధిక విశ్వాసము మరియు సత్క్రియలు' (ఆల్మా 13:3) ఇప్పుడు మీరు విశ్వాసముతోను విధేయతతోనుండిన యెడల మీరు సాధించబోవుచున్నదానికి పునాదిని వేయబోవుచున్నవి. . . . మీరు చేయుటకు గొప్పకార్యము ఉన్నది. మీ దైవిక పరిచర్యను సాధించుటకు మరియు సంతోషము యొక్క ప్రణాళిక ప్రకారము జీవించుటకు బదులుగా, మీరునూ నిలకడగానూ స్థిరముగానూ ఉండవలెను."

**ఎలైన్ ఎస్. డాల్టన్, యువతుల ప్రధాన అధ్యక్షురాలు, "అన్ని సమయములలో అన్ని విషయములలో మరియు అన్ని స్థలములలో," లియహోనా, మే 2008, 116.**

© 2011 by Intellectual Reserve, Inc. అన్ని హక్కులు కలిగియున్నది. భారతదేశములో ముద్రించబడినది. ఆంగ్ల ఆమోదము: 6/10. అనువాద ఆమోదము: 6/10.
Translation of *First Presidency Message, April 2011* యొక్క అనువాదము. Telugu. 09764 421

# ఉపశమన సమాజము యొక్క ఉద్దేశ్యము

ఈ సందేశాన్ని ప్రార్థనాపూర్వకముగా చదువుము మరియు మీరు దర్శించు సహోదరీలతో తగిన విధంగా దీనిని చర్చించుము. మీ సహోదరీలను బలపరచుటలో సహాయపడేందుకు మరియు ఉపశమన సమాజమును మీ స్వంత జీవితంలో క్రియాశీలకంగా చేసేందుకు ప్రశ్నలను ఉపయోగించుము.

విశ్వాసము
కుటుంబము • ఉపశమనము

మా అధ్యక్షత్వము మొదట పిలువబడినప్పుడు, మేము ఉపశమన సమాజము యొక్క చరిత్రను గూర్చి కొన్ని వనరులు ఇవ్వబడ్డాము. ఉపశమన సమాజము యొక్క ఉద్దేశ్యమును మరియు ప్రభువు మమ్మును ఏమి చేయాలని కోరుచున్నారో తెలుసుకొనగోరుచూ వాటిని మేము ప్రార్థనాపూర్వకముగా అధ్యయనము చేసాము. ప్రభువు చేత స్థాపించబడిన ఉపశమన సమాజము యొక్క ఉద్దేశ్యము ఆయన కుమార్తెలను ప్రేరేపించుట, బోధించుట, నిర్వహించుట మరియు నిత్యజీవితము యొక్క దీవెనల కొరకు వారిని సిద్ధపరచుట అని మనము నేర్చుకున్నాము.

ఉపశమన సమాజము యొక్క ఉద్దేశ్యమును నెరవేర్చుటకు, ప్రతీ సహోదరిని మరియు సంస్థ మొత్తమునూ ఈ క్రింది వాటిని చేయమని ప్రభువు ఆజ్ఞాపించియున్నారు:

1. విశ్వాసమునందు మరియు స్వనీతియందు వృద్ధిచెందుట.
2. కుటుంబములను మరియు గృహములను బలపరచుట.
3. ప్రభువుకు మరియు ఆయన బిడ్డలకు సేవ చేయుట ద్వారా ఉపశమనమును కలిగించుట.

మనము వ్యక్తిగత బయల్పాటును వెదకి, పొంది, వాటిపై పనిచేసినప్పుడు మాత్రమే మనము ఈ కార్యమును ప్రభువు యొక్క మార్గములో చేయగలుగుతాము. వ్యక్తిగత బయల్పాటు లేకుండా మనము సఫలము కాలేము. మనము వ్యక్తిగత బయల్పాటుకు చెవియొగ్గిన యెడల, మనము విఫలము కాలేము. పరిశుద్ధాత్మ "(మనము) చేయవలసిన కార్యములన్నింటిని మనకు చూపును" (2 నీఫై 32:5) అని మనకు ప్రవక్త నీఫై ఉపదేశించెను. ఆత్మ యొక్క స్వరమును మనము వినుటకు కావలసినంతగా మనలను మనము నిమ్మళముగా మరియు శాంతముగా చేసుకొనవలెను.

సహోదరీలారా, దేవుని రాజ్యమును నిర్మించుటకు సహాయము చేయుటలో మరియు ప్రభువు యొక్క రాకడకు సిద్ధపడుటలో మనము పోషించుటకు ఒక ముఖ్యమైన పాత్రను కలిగియున్నాము. వాస్తవానికి, ఆయన కుమార్తెల సహాయము లేకుండా ప్రభువు కార్యము పూర్తి చేయబడదు. దానివలన, మన సమర్పణను పెంచాలని ప్రభువు ఆశించుచున్నారు. మునుపెన్నడూ లేనివిధముగా ఉపశమన సమాజము యొక్క ఉద్దేశ్యమును మనము నేరవేర్చాలని ఆయన ఆశించుచున్నారు.

జూలీ బి. బెక్ ఉపశమన సమాజము యొక్క ప్రధాన అధ్యక్షురాలు.

## *లేఖనముల నుండి*

ద్వితీయోపదేశ కాండము 6:5-7; లూకా 10:30- 37; యాకోబు 1:27; 2 నీఫై 25:26; మోషైయ 3:12-13

## *మన చరిత్ర నుండి*

జూన్ 9, 1842 న ఒక ఉపశమన సమాజము యొక్క సమావేశమునందు వారి సమాజము "కేవలము పేదలకు సహాయమందించుటకొరకే కాదు కానీ ఆత్మలను రక్షించుట కొరకు,"[1] అని ప్రవక్త జోసెఫ్ స్మిత్ బోధించెను. ఈ విధమైన ఆధ్యాత్మికమైన మరియు అదేవిధముగా భౌతికమైన ఉద్దేశ్యములతో కూడిన ప్రకటన దాని చరిత్ర అంతటిలో ఉపశమన సమాజము యొక్క పాత్రను రూపకల్పన చేసెను. 1906 లో అధ్యక్షుడు జోసెఫ్ ఎఫ్. స్మిత్ (1838-1918) బోధించారు: "పేదవారి, అనారోగ్యముతోనున్నవారి లేమికలిగియున్నవారి యొక్క అవసరతలతో వ్యవహరించుట మాత్రమే కాదు, కానీ సీయోను యొక్క తల్లులు మరియు కుమార్తెల యొక్క రక్షణ మరియు ఆత్మీయ సంక్షేమమును చూచుకొనుటలో కూడా (ఉపశమన సమాజము) పెద్ద పాత్రను కలిగియున్నది; ఎవ్వరూ నిర్లక్ష్యము చేయబడక, అదేవిధముగా దురదృష్టములనుండి, విపత్తులనుండి, చీకటి శక్తులనుండి మరియు లోకములో వారిని భయపెట్టు దుష్టత్వములనుండి అందరూ రక్షింపబడునట్లు చూచుట."[2] 2001లో పన్నెండు మంది అపొస్తలుల కోరము యొక్క ఎల్డర్ రస్సెల్ ఎమ్. బల్లార్డ్ పునరుద్ఘాటించారు, "ఈ సంఘములో ప్రభువుతో నిబంధనలు చేసిన ప్రతీ సహోదరి ఆత్మలను రక్షించుటకు సహాయము చేయుటకు, లోకములోని స్త్రీలను నడిపించుటకు మరియు సీయోను యొక్క గృహములను బలపరచుటకు, మరియు దేవుని రాజ్యమును నిర్మించుటకు ఒక దైవిక బాధ్యతను కలిగియున్నారు."[3]

### వివరణలు

1. జోసెఫ్ స్మిత్, సంఘ చరిత్ర, 5:25.
2. సంఘాధ్యక్షుల బోధనలు: జోసెఫ్ ఎఫ్. స్మిత్ (1998), 185.
3. ఎమ్. రస్సెల్ బల్లార్డ్, "నీతిమంతులైన స్త్రీలు," లియహోనా, డిశంబరు 2002, 39.

***నేనేమి చేయగలను?***

1. నా సహోదరీలు విశ్వాసమునందు మరియు వ్యక్తిగత నీతిగల జీవితమునందు వృద్ధిచెందునట్లు, వారి కుటుంబములను మరియు గృహములను బలపరచుకొనునట్లు సహాయము చేయుటకు నేను ఎటువంటి ప్రేరణను గైకొనియున్నాను?
2. నా విశ్వాసమును బలపరచుకొనుటకు మరియు వ్యక్తిగతముగా నీతిగల జీవితము పట్ల నా యొక్క సమర్పణను వృద్ధిచేసుకొనుటకు నేను ఈ సందేశమును ఎలా ఉపయోగించబోవుచున్నాను?

అదనపు సమాచారము కొరకు, www.reliefsociety.lds.org చూడుము.

© 2011 Intellectual Reserve, Inc. అన్ని హక్కులు కలిగియున్నది. భారతదేశములో ముద్రించబడినది. ఆంగ్ల ఆమోదము 6/10. అనువాద ఆమోదము 6/10. Translation of *Visiting Teaching Message, April 2011*. యొక్క అనువాదము. Telugu. 09764 421